సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



నమో నారసింహ

41 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం

శ్రీ నృసింహ దీక్షలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు సింహగిరికి వచ్చిన సుమారు వెయ్యిమంది దీక్షాధారులకు ఉదయం 8 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు.





8లో

దీపకాంతులతో మెరిసిన వరాహ పుష్కరిణి



వరాహ పుష్కరిణిలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి దీపకాంతులతో మెరిసింది. సోమవారం పోలిపాడ్యమిని పురస్కరించుకొని వేకువ జామున 3 గంటల నుంచే వేలాది మంది మహిళలు పెద్ద ఎత్తున వరాహ పుష్కరిణికి చేరుకున్నారు. అరటి డొప్పలలో దీపాలను వెలిగించి పుష్కరిణిలో విడిచిపెట్టారు. కార్తీక దామోదరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పుష్కరిణి వద్దనున్న రావి, మర్రిచెట్లు, తులసికోట వద్ద దీపారాధన చేశారు. బ్రాహ్మణులకు సాలగ్రామ దానాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి ప్రాంతం కిక్కిరిసింది. అడవివరం మార్కెట్ కూడలి నుంచి పుష్కరిణికి వెళ్లే మార్గమంతా తీవ్ర రద్దీగా మారింది. పుష్కరిణి వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలను అలంకరించారు. గజ ఈతగాళ్లను, సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచారు. గోపాలపట్నం పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేశారు. – సింహాచలం

భక్తజన కల్పవల్లి.. కనకమహాలక్ష్మి



ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులు కురిపించే చల్లనితల్లి బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 8లో

టెక్ ఫెస్ట్‌కు ఏర్పాట్లు



టెక్‌ఫెస్ట్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాళ్లు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 4, 5 తేదీల్లో విశాఖ రీజినల్ టెక్‌ఫెస్ట్–2024 నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక పరమైన సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణతో కలిసి ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ ఫెస్ట్‌లో విశాఖ రీజియన్ ప్రాంతంలోని 8 ప్రభుత్వ, 19 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారు. 200కు పైగా సృజనాత్మక ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శిస్తారని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు. నగరంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులు టెక్ ఫెస్ట్‌ను సందర్శించవచ్చని తెలిపారు. ఈ ఫెస్ట్‌లో మొదటి 15 స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

పతాక నిధికి విరాళాలు సేకరించండి

మహారాణిపేట: సాయుధ దళాల పతాక దినోత్సవంలో భాగంగా పతాక నిధికి విరివిరిగా విరాళాలు సేకరించాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఈ నెల 7న జరగనున్న సాయుధ దళాల పతాక దినోత్సవంపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. గతేడాదికి పతాక నిధికి విరాళాల సేకరణలో విశాఖ ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది కూడా ప్రజలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల నుంచి విరాళాలు సేకరించాలని సూచించారు. స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్ విక్రయాల ద్వారా విరాళాలు సేకరించాలని రవాణా, పరిశ్రమల శాఖ అధికారులను సూచించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ.సత్యానందం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు కంచరపాలెంలో జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెంలోని ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. సైఫ్ ఆటోమేషన్ సర్వీసెస్‌లో టెస్టింగ్ అండ్ డిమాన్‌స్ట్రేషన్ టెక్నీషియన్, స్టోర్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఫోర్‌మన్, మెకానికల్ ఫిట్టర్, సోల్డరింగ్ టెక్నీషియన్ లేదా మెకానికల్ ఇంజనీర్ తదితర 20 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఐటీఐ లేదా డిప్లమో పూర్తి చేసిన 19–45 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. క్యాడ్‌మాక్స్ సొల్యూషన్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ 100 అప్రెంటిస్‌షిప్ ట్రైనీలను నియమించనుంది. డిప్లమో లేదా బీటెక్ పూర్తి చేసిన 19–25 ఏళ్ల మధ్య వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులు. క్యూ కనెక్ట్(యాక్సిస్ బ్యాంక్) భర్తీ చేసే 50 వాయిస్ ప్రాసెసింగ్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అర్హులు. 18–26 ఏళ్ల మధ్య వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పేటీఎం 40 ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేస్తోంది. ఎస్ఎస్‌సీ లేదా అంతకంటే ఎక్కువ అర్హత కలిగిన 18–35 ఏళ్ల మధ్య వయసు ఉన్న పురుష అభ్యర్థులు అర్హులు.వివరాలకు 99487 68778లో సంప్రదించవచ్చు.

30న పోస్టల్ డాక్ అదాలత్

ఎంవీపీకాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 30న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 102వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు రైల్వే మెయిల్ సర్వీసెస్(ఆర్ఎంఎస్) వి డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు వారి సమస్యలను ఈ నెల 23వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 30వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

సేవ్ వాల్తేరు

విశాఖపట్నం

కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వాల్తేరు డివిజన్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలను బట్టి చూస్తే డివిజన్ విభజన అనివార్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వైపు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా.. మరోవైపు వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌గా ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 130 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌ను కాపాడాలన్న ప్రజల డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అందరిలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.

– సాక్షి, విశాఖపట్నం

- కొత్త జోన్‌కి టెండర్ల నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌పై నీలినీడలు
- రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయనున్న బోర్డు
- డివిజన్ కొనసాగింపును పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వాల్తేరు డివిజన్ తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో ప్రజలు ఆనందించినప్పటికీ.. కేంద్రం తీసుకున్న తదుపరి నిర్ణయంతో ఆ ఆనందం నీరుగారిపోయింది. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ, మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లో కలుపుతున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 1,106 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న వాల్తేరు డివిజన్‌లో 541 చదరపు కిలోమీటర్ల భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాయగడ డివిజన్‌లో, మిగిలిన 565 చదరపు కిలోమీటర్ల భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.



పట్టించుకోని నేతలు



ఓవైపు జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ఇటీవలే టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు ఖరారు చేసిన రెండేళ్లలో కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ లోగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. జోన్ డీపీఆర్‌లోనూ విశాఖ డివిజన్‌ని కొనసాగిస్తే మంచిదని కూడా సూచించారు. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన అనివార్యమైనట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుత ఎంపీలు ఈ విషయంలో ఎలాంటి చొరవ చూపడం లేదు. ఎంపీలు ఒత్తిడి తెస్తే వాల్తేరు డివిజన్ కొనసాగే అవకాశం ఉన్నా.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

వాల్తేరే కీలకం

తూర్పుకోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డులాంటిది. జోన్ పరిధిలో అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే డివిజన్ ఇదే. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా.. ఇందులో రూ.7 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12–14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లు ఉన్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లు ఉండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్‌గా వాల్తేరు నిలుస్తోంది. ఐరన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్ వంటి ప్రధాన మార్గాల ద్వారా వాల్తేరు డివిజన్‌కు అధిక ఆదాయం వస్తుంది. వాల్తేరు డివిజన్‌ను విభజిస్తే.. ఈ ఆదాయం రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. అంటే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త జోన్ తన సింహభాగం ఆదాయాన్ని కోల్పోనుంది.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



వాల్తేరు డివిజన్ విభజన ప్రకటనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదు. జోన్ రావడం ఆనందంగా ఉన్నా.. చారిత్రక నేపథ్యం ఉన్న డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. వాల్తేరును విజయవాడలో విలీనం చేయడం అవగాహనా రాహిత్యం. దీని వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల సెంటిమెంట్ దెబ్బతిన్నట్లే. ప్రజా ప్రతినిధులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

– బి.కృష్ణారావు, విశ్రాంత రైల్వే ఉద్యోగి

వాల్తేరు డివిజన్ కొనసాగించాల్సిందే...



ఎంతో చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. యూనియన్లు, వివిధ ప్రజాసంఘాలు కలిసికట్టుగా పోరాటం చేస్తే.. ప్రజలంతా మద్దతునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– ఎస్.ఈశ్వరరావు, రైలు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి



నిర్లక్ష్యానికి మచ్చుతునక

కేజీహెచ్‌లో రోగులకు వైద్య పరీక్షలు చేయించే విషయంలో వారి కుటుంబ సభ్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సోమవారం ఎమర్జెన్సీ నుంచి ఓ రోగిని కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో స్కానింగ్ కోసం తీసుకువెళ్లే విధానం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. రోగికి ఆక్సిజన్ పెట్టిన సిలిండర్‌ను స్ట్రెచర్ లేదా వీల్స్ ఉండే ప్రత్యేక సాధనం ద్వారా తీసుకువెళ్లాల్సి ఉండగా.. ఇలా ఈడ్చుకుంటూ వెళ్లడం నిర్లక్ష్యానికి మచ్చుతునక. ఏమాత్రం ఆక్సిజన్ పైపు ఊడిపోయినా.. సిలిండర్‌ను లాక్కొని వెళ్తున్న క్రమంలో రాపిడికి ప్రమాదం సంభవిస్తే ఏంటి పరిస్థితి. – ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కొత్త కార్డులకు తిప్పలు

- కొత్త కార్డుల మంజూరుపై ఇంకా రాని మార్గదర్శకాలు
- 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ప్రజలు
- ఇంకా ఆప్షన్ ఇవ్వలేదంటున్న సచివాలయ ఉద్యోగులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు కావొస్తున్నా.. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు మంజూరు చేయలేదు. సోమవారం కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వం చెప్పడంతో దరఖాస్తుదారులు సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యారు. ఒకవేళ దరఖాస్తులు స్వీకరించినప్పటికీ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసే ఆప్షన్ ఇవ్వలేదని పేర్కొంటున్నారు.

ఈ నెల 2వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే ప్రకటించారు. కొత్త వాటితో పాటు ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. అయితే 2వ తేదీ వచ్చినప్పటికీ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేయలేదు. ప్రజాప్రతినిధుల ప్రకటనలతో సోమవారం దరఖాస్తుదారులు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లారు. దరఖాస్తుల నమోదుకు ప్రభుత్వం ఇంకా ఆప్షన్ ఇవ్వలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వారంతా కంగుతిన్నారు. ప్రధానంగా కొత్త రేషన్‌కార్డులతో పాటు ఉన్న కార్డుల్లో అనేక తప్పులు దొర్లాయి. ఒకరి ఆస్తి పన్నుకు మరొకరి ఆధార్‌కార్డును జత చేశారు. అలాగే ఎటువంటి ఇల్లులేకుండానే ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారు. అలా అనేక మంది కార్డుల్లో ఇటువంటి తప్పులు ఉన్న కారణంగా పలు పథకాలకు దూరమయ్యారు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తే తప్ప వీటిని సరిచేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా.. ప్రస్తుతం జిల్లాలో 5,12,619 తెలుపు కార్డులు ఉన్నాయి.

ఆన్ డ్యూటీ సార్..!



రక్షణ దళానికి... యూనిఫాం టోపీ ఓ గౌరవం. అధికారి హోదాని.. సంబంధిత విభాగం హుందాతనాన్ని సూచిస్తుంది. మనిషికి తల ఎంత అవసరమో.. నేవీ ఉద్యోగికి టోపీ అంతే అవసరం. నేవీ డే ఏర్పాట్లకు సంబంధించి తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి వివిధ హోదాలకు చెందిన నేవీ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో టోపీలు పెట్టుకోకూడదన్న నిబంధనని గౌరవిస్తూ బయటనే విడిచిపెట్టారు. వివిధ హోదాలకు చెందిన అధికారుల టోపీలు కలిసిపోకుండా వాటికి ప్రత్యేక స్థానాలు కల్పిస్తూ ఓ నేవీ ఉద్యోగి ఇలా పహారా కాస్తున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- ఈనెల 2,4,6,7,9,11,13,14వ తేదీల్లో ధన్‌బాద్–అలప్పుజ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, ఈనెల 4, 11వ తేదీల్లో జసిద్ది–తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 7, 14వ తేదీల్లో హతియా–ఎస్‌ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, 6, 13వ తేదీల్లో టాటానగర్– ఎస్‌ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, 9న హతియా– ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు ఆయా తేదీల్లో ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ప్రయాణించవు.

ఫుట్‌బాల్ పోటీల విజేత ఏవీఎన్

ఏయూలో అంతర్ కళాశాలల పోటీలు



ట్రోఫీ అందిస్తున్న ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరగ్గా.. 7 జట్లు విజయం కోసం పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో ఏవీఎన్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఏ), డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, ఆచార్య టి.షారోన్‌రాజు, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఎ.పల్లవి, ఆచార్య వాసుదేవరాజు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్లు

ఎంవీపీకాలనీ: 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిథ్యం వహిస్తాయన్నారు. పురుషుల జట్టుకు మేనేజర్‌గా పి.బాలకృష్ణ, కోచ్‌గా పి.చైతన్య, కెప్టెన్‌గా ఎస్.తేజ వ్యవహరించనున్నారు. మహిళల జట్టుకు మేనేజర్‌గా ఎన్.పోలయ్య, కోచ్‌గా కె.లక్ష్మణరావు, కెప్టెన్‌గా పి.అంజలి వ్యవహరిస్తారని ప్రసాదరెడ్డి తెలిపారు. ఎంపికైన పురుషుల జట్టుకు ఏయూ ఇండోర్ స్టేడియంలో, మహిళల జట్టుకు గాజువాక కబడ్డీ గ్రౌండ్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

స్వయం ఉపాధికి ఊతం

- సీఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ
- కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో నిర్వహణ
- రెడీ టు కుక్ పద్ధతిలో చేపలు, రొయ్యల కటింగ్





శిక్షణ అందిస్తున్న సీఐఎఫ్‌టీ సీనియర్ సైంటిస్ట్

సాక్షి, విశాఖపట్నం: చేపలు, రొయ్యలకు మార్కెట్‌లో గిరాకీ ఎక్కువగా ఉన్నా.. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన యువత సంప్రదాయ వేట పద్ధతులకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి శిక్షణను ఉచితంగా అందిస్తోంది. మత్స్య ఆధారిత ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రెట్టింపు ఆదాయాన్ని ఆర్జించే మార్గాలను నేర్పిస్తోంది. షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్‌ప్లాన్ (ఎస్సీ ఎస్పీ), షెడ్యూల్డ్ ట్రైబ్ సబ్ ప్లాన్(ఎస్టీ ఎస్పీ)లో భాగంగా సీఐఎఫ్‌టీ గత పదేళ్లుగా 'రెడీ టు కుక్, వాల్యూ యాడెడ్ సీఫుడ్ ప్రాడక్ట్స్ తయారీ'పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మత్స్యకారులకు సాంకేతిక నైపుణ్యాలు అందించి, వారిని స్వయం ఉపాధి రంగంలో బలోపేతం చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులు తమ ఉత్పత్తులకు విలువ చేర్చి, మరింత ఆదాయాన్ని పొందే అవకాశం లభిస్తోంది.

ప్రతి బ్యాచ్‌కూ 11 మంది..

బీచ్‌రోడ్డులోని సీఐఎఫ్‌టీ ప్రధాన కార్యాలయంలో ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ప్రతి బ్యాచ్‌లో 11 మందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. మత్స్య సంబంధిత కార్యకలాపాల్లో భాగస్వాములుగా ఉన్న వారు, ఈ రంగంలో స్వయం ఉపాధి పొందాలనుకునే వారు ఈ శిక్షణకు అర్హులు. పదేళ్లలో 30కి పైగా బ్యాచ్‌లకు సీఐఎఫ్‌టీ ఈ శిక్షణను అందించి.. అనేక మందికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించింది. తాజాగా ఓ బ్యాచ్‌కు శిక్షణ పూర్తి చేశారు.

ట్రైనింగ్‌లో ఏం నేర్పిస్తారంటే..

సుస్థిర జీవనోపాధి అభివృద్ధికి మార్గం సుగమం చేస్తూ స్వయం ఉపాధికి బాటలు వేసేలా శిక్షణ ఉంటుంది. సముద్ర ఉత్పత్తుల మినీ ప్రాసెసింగ్, వాల్యూ–అడిషన్ యూనిట్‌ను స్థాపించడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తారు. ఫిష్ పిల్లెట్స్, ఫిష్ స్టీక్స్, మ్యారినేట్ చేసిన చేపలు, పీల్డ్ అండ్ డెవైన్డ్ రొయ్యలు, బటర్‌ఫ్లై రొయ్యలు, నోబాషి రొయ్యలు వంటి వాటిని రెడీ–టు–కుక్ చేసుకునేందుకు వీలుగా శిక్షణ ఇస్తారు. అలాగే ఫిష్ బాల్స్, ఫిష్ ఫింగర్స్, ఫిష్ కట్‌లెట్స్, ఫిష్ బర్గర్స్, కోటెడ్ రొయ్యలు వంటి విలువ చేకూర్చిన సముద్ర ఆహార ఉత్పత్తుల తయారీని కూడా సులభంగా నేర్పుతారు. సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.బి. మధుసూదనరావు, సీనియర్ సైంటిస్ట్ డా.జెస్మీ డెబర్మా పర్యవేక్షణలో సీనియర్ సైంటిస్ట్ డా.విజీ నేతృత్వంలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.

స్వయం ఉపాధి ఎలా.?

శిక్షణ అనంతరం లబ్ధిదారులకు మినీ ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన సహకారం అందజేస్తారు. సీఐఎఫ్‌టీ రీసెర్చ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తల నిరంతరం సాంకేతిక మద్దతు ఉంటుంది. అయితే యూనిట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని లేదా దుకాణాన్ని లబ్ధిదారులు స్వయంగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

బెస్ట్ చెఫ్ అవ్వాలని...



నేను ఇంటర్ పూర్తి చేశాను. డిగ్రీలో చేరబోతున్నాను. చెఫ్ కావాలన్నది నా లక్ష్యం. ఇప్పటికే హోటల్ రంగంలో కొంత అనుభవం ఉంది. దానికి మరింత నైపుణ్యం జోడించుకోవాలనే లక్ష్యంతో ఈ శిక్షణ శిబిరానికి హాజరయ్యాను. ఫిష్ కటింగ్, స్కిన్‌లెస్ ఫిష్, ఫింగర్స్ ఇలా భిన్నమైన విధానాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రొఫెషనల్‌గా మరింత రాటుదేలేందుకు నాకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుంది. భవిష్యత్తులో బెస్ట్ చెఫ్ అవ్వాలన్నదే నా లక్ష్యం. – **జాయ్, అప్పుఘర్**

రెడీ టు కుక్ వ్యాపారాన్ని ప్రారంభిస్తా..



కేజ్ కల్చర్ ద్వారా చేపలు ఉత్పత్తి చేస్తున్నాను. మెట్రో నగరాల్లో మత్స్య ఉత్పత్తుల వినియోగం పెరుగుతోంది. అయితే రొయ్యలు, చేపలను కొని.. శుభ్రం చేసి వంట చేసేంత సమయం ఎవరికీ లేదు. రెడీ టు కుక్ పేరుతో ఇప్పటికే వెజిటబుల్స్ అందుబాటులోకి వచ్చాయి. మత్స్య ఉత్పత్తులు వచ్చినా ఖరీదుతో దొరుకుతున్నాయి. ఈ శిక్షణలో అన్ని అంశాలు నేర్చుకుని.. అందరికీ అందుబాటులో ఉండే ధరలతో రెడీ టు కుక్ వ్యాపారం ప్రారంభిస్తా.. **–విక్టర్, ఆశీల్‌మెట్ట**

సీఐఎఫ్‌టీ సహకారంతో స్థిరపడతా..



నేను డిగ్రీ పూర్తి చేశాను. మా కుటుంబాలు మత్స్య ఉత్పత్తులపైనే దశాబ్దాలుగా ఆధారపడి జీవిస్తున్నాయి. కానీ ఎలాంటి ఎదుగుదల కనిపించడం లేదు. సంప్రదాయ పద్ధతుల నుంచి అడుగు ముందుకేసేందుకు, జీవనోపాధి మెరుగుపరచుకునేందుకు ఈ శిక్షణ తీసుకుంటున్నాను. ప్రతి అంశాన్నీ ప్రాక్టికల్‌గా చూపిస్తున్నారు. హోటల్ రంగంలో స్థిరపడాలన్న నా లక్ష్యానికి సీఐఎఫ్‌టీ సహకరిస్తోంది.

– **కిరణ్‌బాబు, జాలరిపేట**

ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానిస్తున్నాం



ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణ తరగతులతో ఎంతో మంది స్వయం ఉపాధి పొందారు. మత్స్య ఉత్పత్తులతో అదనపు ఆదాయాన్ని ఎలా ఆర్జించగలమనే దానిపై పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తూ నిపుణులుగా తీర్చిదిద్దుతున్నాం. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాం. ఇతర రాష్ట్రాల వారికీ ట్రైనింగ్ ఇస్తున్నాం. వారంతా వైజాగ్ సీఐఎఫ్‌టీ కేంద్రానికి రాలేని నేపథ్యంలో.. వారి ప్రాంతానికే వెళ్లి శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాం. – **యు.శ్రీధర్**, సీఐఎఫ్‌టీ వైజాగ్ హెడ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్

నమో నారసింహ

- ఘనంగా 41 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం
- 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష



వేదికపై అప్పన్నస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



తులసి మాలలను వేదిక వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

సింహాచలం: శ్రీ నృసింహ దీక్షలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు సింహగిరికి వచ్చిన సుమారు వెయ్యి మంది దీక్షాధారులకు ఉదయం 8 గంటలకు దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమని ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసిమాలలను ఉంచి అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతర దీక్షాధారులకు మాలధారణ చేశారు. స్వామివారి తులసి మాల, దీక్ష నియమావళి పుస్తకాలను అందజేశారు. స్వామి దర్శనాన్ని ఉచితంగా కల్పించారు. అన్నప్రసాద భవనంలో దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందజేశారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చెందిన చందన పెరుమాళ్ పీఠంకి చెందిన భక్తులు, సింహాద్రి మఠంకి చెందిన భక్తులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజనులు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ఈనెల 12 నుంచి 32 రోజుల శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. జనవరి 12వ తేదీన దీక్షావిరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విన్నపాలు వినవలె..

కలెక్టరేట్ @ 211 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 211 వినతులు అందాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 78, పోలీసు శాఖకు 15, జీవీఎంసీకి సంబంధించి 60 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 58 వినతులు వచ్చాయి. అంతకుముందు కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు 9,703 అర్జీలు స్వీకరించగా.. ఇందులో 7,723 అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన అర్జీలకు 10 రోజుల్లోపు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంవో నుంచి జిల్లాకు సంబంధించి వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. జిల్లాలో వివిధ శాఖల లక్ష్య సాధనలో 100 రోజుల యాక్షన్ ప్లాన్, ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ పాల్గొన్నారు.

జీవీఎంసీ @ 90



వినతులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి మేయర్ వినతులు స్వీకరించారు. జోన్–2 నుంచి 11, జోన్–3 నుంచి 13, జోన్–4 నుంచి 14, జోన్–5 నుంచి 5, జోన్–6 నుంచి 17, జోన్–8 నుంచి 11, ప్రధాన కార్యాలయానికి సంబంధించి 19 ఫిర్యాదుల అందాయి. వీటిలో జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి 13, ప్రజారోగ్య విభాగానికి 6, అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 51, ఇంజినీరింగ్ విభాగానికి 13, హార్టికల్చర్ విభాగానికి 2, యూసీడీ విభాగానికి 2 ఫిర్యాదులు ఉన్నాయి. సీసీపీ ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్ @ 85



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి.. సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

డయల్ యువర్ సీపీకి రెండు ఫిర్యాదులు

దివ్యాంగ్ సురక్ష కార్యక్రమంలో భాగంగా డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం నిర్వహించారు. ఇద్దరు దివ్యాంగులు కాల్ చేసి తమ సమస్యలను సీపీకి విన్నవించారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలి ద్వారా సీపీ వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ ఫిర్యాదులపై వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్లలో దర్యాప్తు చేసి న్యాయం జరిగేలా చూస్తామని సీపీ వారికి హామీ ఇచ్చారు.

ప్రజాదర్బార్‌కు 9 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 9 ఫిర్యాదులు వచ్చాయి. చైర్మన్‌తో పాటు కమిషనర్ విశ్వనాథన్, సంయుక్త కమిషనర్ కె.రమేష్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని చెప్పారు. విభాగాధిపతులు భవానీ శంకర్, శిల్ప, హరిప్రసాద్, శివానీ, వేణుగోపాల్, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

అగనంపూడి: పాడేరు నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని.. వారి నుంచి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన ఉపేంద్ర, నర్సీపట్నానికి చెందిన పూడి శ్రీనివాస్, కశింకోట మండలం గోకినవానిపాలేనికి చెందిన సారిపల్లి రామకృష్ణ కలిసి పాడేరు వెళ్లి.. అక్కడ ఆటో డ్రైవర్ వద్ద 40 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. వీటిని రెండు కిలోల వంతున 20 ప్యాకెట్లుగా విభజించి.. గోనె సంచిలో ద్విచక్రవాహనంపై తీసుకువచ్చారు. దీనిపై ముందస్తు సమాచారంతో దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని మంగళపాలెం వద్ద టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు కాపు కాశారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోతుండగా.. పోలీసులు వారిని ఛేజ్ చేసి పట్టుకున్నారు. వారి నుంచి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వీరిలో ఉపేంద్ర, రామకృష్ణ పాత నేరస్తులని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోరమాండల్‌లో డ్రైవర్ అనుమానాస్పద మృతి



రమణ(ఫైల్)

మల్కాపురం: కోరమాండల్ పరిశ్రమలో ఓ కారు డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. బొబ్బిలి ప్రాంతానికి చెందిన సారిక రమణ(38) భార్య సత్యవతి, ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి షీలానగర్ వద్ద అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కోరమాండల్ పరిశ్రమలో ఓ ప్రైవేట్ ట్రావెల్ యజమాని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరి గానే ఆదివారం కూడా విధులకు హాజరయ్యాడు. ఈ క్రమంలో సంస్థ ఆవరణలోని రియాక్టర్ పడి.. అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం తోటి ఉద్యోగులు అతని మృతదేహాన్ని గుర్తించి.. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణకు ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? లేదా సంస్థలో ఎవరైనా వేధింపులకు గురి చేశారా? కుటుంబ కలహాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రమణ భార్య సత్యవతి, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ వద్ద తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి రూ.40 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఇందులో తమ తప్పిదం లేదని, అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని యాజమాన్యం చెబుతోంది.

భక్తజన కల్పవల్లి.. కనకమహాలక్ష్మి

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులు కురిపించే చల్లనితల్లి బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించి ప్రత్యేక పూజలు జరిపారు. తొలి రోజు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మార్గశిరం తొలిపూజలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సీపీ ప్రత్యేక పూజలు

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సంప్రదాయ ప్రకారం ఈవో కె.శోభారాణి పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ప్రతి రోజూ అన్నదానం

మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని నెల రోజులపాటు అన్నదానం నిర్వహించనున్నారు. తొలిరోజున టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి రోజూ 2 వేల మందికి, ఉత్సవాలు చివరి రోజున 20 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.

పదోన్నతి జాబితాలో అవకతవకలు

సచివాలయాల హెల్త్ సెక్రటరీల ఆరోపణ



ఆందోళన చేస్తున్న గ్రామ,వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీలు

మహారాణిపేట: గ్రామ/వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల పదోన్నతి మెరిట్ జాబితా తయారీలో జరిగిన అవకతవకలపై దృష్టి సారించాలని ఏపీ యునైటెడ్ విలేజ్/వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఉషా) ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అంతకుముందుకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ డీఎంహెచ్‌వో కార్యాలయంలో జవాబుదారీతనం లేదని ఆరోపించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల ప్రమోషన్ల కోసం ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ప్రకటించారని.. ఇది పూర్తిగా అసత్యాలు, అవకతవకలతో నిండి ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మాదిరిగా రాత పరీక్షలో వచ్చిన మార్కులు, వెయిటేజీ, బోనస్ మార్కులు, ర్యాంక్‌ల ప్రాతిపదికన కొత్త జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు ఆళ్ల దేవకి మాట్లాడుతూ తాము లేవనెత్తిన అభ్యంతరాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తాము అడిగిన పద్ధతుల్లో జాబితా ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నారని.. అన్యాయం జరిగిందని భావిస్తే కోర్టుకు వెళ్లమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.